క్లుప్తంగా

కిట్స్ అక్షర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నాక్-ఏ గుర్తింపు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని యనమదల కిట్స్ అక్షర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు నాక్-ఏ గుర్తింపు లభించినట్లు కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై 18, 19 తేదీల్లో జరిగిన ఎన్ఏఏసీ (నాక్) తనిఖీల ఫలితాన్ని ఆదివారం అధికారికంగా విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ఫలితంలో తమ కళాశాల నాక్-ఏ గ్రేడ్ సాధించిందని చైర్మన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాల నాక్-ఏ గ్రేడు సాధించడం పట్ల కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, డైరెక్టర్ గోగినేని సాంబశివరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకోటయ్యలు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు.

'మీ కోసం' సద్వినియోగం చేసుకోండి

ప్రత్తిపాడు తహసీల్దార్ కె.రవిబాబు

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాడు తహసీల్దార్ కె.రవిబాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మీ కోసంలో వచ్చే అర్జీలు ఆన్‌లైన్‌లో నమోదై, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించబడతాయని పేర్కొన్నారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర గంటల వరకు మండల స్థాయి అధికారులంతా మీ కోసంలో అందుబాటులో ఉంటారన్నారు. ఇతర రోజుల్లో అర్జీలు ఇవ్వడం వలన నిర్ణీత సమయంలో అవి పరిష్కారమయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయని, సోమవారం ఇవ్వడం వలన అర్జీలపై విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని రవిబాబు కోరారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



పెదకాకాని: బాజీబాబా దర్గాలో ప్రార్థనలు చేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు అమావాస్య రోజున రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. అమావాస్య ఆదివారం కూడా కలసి రావడంతో దర్గా ప్రాంగణమంతా భక్తులతో కళకళలాడింది. భక్తులు దర్గా ప్రాంగణంలో ఉన్న షఫా బావి నీటితో స్నానాలు చేసి దర్గాలో ప్రదక్షిణలు చేశారు. బాజీబాబా వారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. భక్తులు బాబా వారికి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు రాత్రి దర్గా ప్రాంగణంలోనే నిద్రలు చేశారు. దాతలు దర్గా ప్రాంగణంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. దర్గా సిబ్బంది అంత్రాలు, దిష్టికాయలు, వాహన పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా బాజీబాబా దర్గా ఈవో షేక్ ముక్తార్ బాషా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దర్గా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు హర్షణీయం



ప్రత్తిపాడు: సుప్రీం తీర్పుతో మాదిగ, మాదిగ ఉప కులాలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఏటుకూరి విజయ్‌కుమార్ మాదిగ, కారుమూరు బెర్నార్డ్ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు బస్టాండ్ సెంటర్‌లో దళితుల ఆశాజ్యోతులు డాక్టర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్తిపాడు మండలాధ్యక్షుడు ఉన్నం రత్తయ్య మాదిగ, పెదనందిపాడు మండలాధ్యక్షుడు కారుమూరి ఇంద్రబాబు మాదిగల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ, కారుమూరు బెర్నార్డ్ మాదిగలు హాజరయి మాట్లాడుతూ ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామంలో 1994లో 20 మంది యువకులతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భవించిందన్నారు. గత 30 ఏళ్లగా ఎస్సీలను వర్గీకరించాలని మాదిగలు పోరాటాలు చేశారని చెప్పారు. వారి త్యాగాలు అలాగే 2004 నుంచి పంజాబ్, హరియాణా ప్రభుత్వాలు చేసిన పోరాటాల ఫలితమే సుప్రీం ఇచ్చిన తీర్పు అని వివరించారు.

■ సుప్రీం ధర్మాసనం ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ, రాజకీయ రంగు పులమకుండా వర్గీకరణ చేయమని రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఇచ్చిందని, ఈ విజయం దేశంలో ఉన్న ప్రతి ఒక్క మాదిగల విజయమని చెప్పారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో రాబోయే రోజుల్లో పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా కన్వీనర్ కొమరాల శ్రీనివాస్ మాదిగ, సీనియర్ నాయకులు సిద్దేలా ఇజ్రాయేలు మాదిగ, వలేటి భూషణం మాదిగ, దేవరకొండ బాబూరావు మాదిగ, కరసాల కళ్యాణ్ మాదిగ, కంభంపాటి వెంకటరావు మాదిగ, దేవరకొండ బుజ్జి మాదిగ పాల్గొన్నారు.

గతి తప్పుతున్న బడి

- ఈ ఏడాది తగ్గిన ఎన్‌రోల్‌మెంట్
- వెంటాడుతున్న ఉపాధ్యాయుల కొరత
- పలు పాఠశాలల్లో సింగిల్ టీచర్లే
- ఎండీఎంకు వేల మంది విద్యార్థులు దూరం
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు రాజకీయ రంగు



ప్రత్తిపాడు ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో ఒకే తరగతి గదిలో కూర్చోబెట్టిన మూడు తరగతుల విద్యార్థులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది వరకు సుమారు 650 మందికి పైగా విద్యార్థులు ఉండగా ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య 401కి చేరింది. కానీ వెయ్యి మందికి పాఠాలు చెప్పగల 30 మందికి పైగా ఉపాధ్యాయులు ఈ పాఠశాలలో ఉన్నారు. ఇది ఈ ఒక్క పాఠశాల పరిస్థితే కాదు. నియోజకవర్గంలో ఉన్న అనేక పాఠశాలల్లో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. 2023-24 విద్యా సంవత్సరంతో పోల్చితే 2024-25 విద్యా సంవత్సరంలో దాదాపు 800 మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిపోయారు.

గత విద్యా సంవత్సరం వరకు కళకళలాడిన పాఠశాలలు ఇప్పుడు క్రమంగా గతి తప్పుతున్నాయి. గత ఏడాదితో పోల్చితే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. విద్యార్థుల సంఖ్యకు సరిపడినంత మంది ఉపాధ్యాయులు లేక కొన్ని పాఠశాలల్లో ఇబ్బందులు పడుతుంటే, విద్యార్థులు తక్కువగా ఉండి ఉపాధ్యాయులు అధికంగా ఉన్న పాఠశాలలూ లేకపోలేదు.



యనమదల హైస్కూల్లో మధ్యాహ్న భోజనం కోసం బారులు తీరిన విద్యార్థులు

ఏజెన్సీలకు రాజకీయ రంగు..

ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం అందించే ఏజెన్సీలకు రాజకీయ రంగు పులుము తున్నారు. కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులను అకారణంగా బలవంతంగా తప్పించి, స్వచ్ఛందంగా రాజీనామా లెటర్లు రాయించుకుని, కొత్త వారిని నియమించుకుంటున్నారు. ఇదే తరహాలో ఇప్పటికే చినకోండ్రుపాడు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో, నడింపాలెం హెచ్‌డబ్ల్యూ స్కూల్లో, కొండజాగర్లమూడి ప్రాథమిక పాఠశాలలో ఏజెన్సీలను మార్చేశారు. కాగా చినకోండ్రుపాడు, గొట్టిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో ఏజెన్సీల మార్పుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే మండల విద్యా శాఖ అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఏజెన్సీల మార్పులకు సంబంధించిన ప్రపోజల్స్ మండల కమిటీకి పంపగా వారు సక్రమంగా లేని కారణంగా తిరస్కరించారు. అయినా తీరు మారకుండా పదేపదే ప్రపోజల్స్‌ను విద్యాశాఖ అధికారులు పంపుతూనే ఉన్నారు.

మధ్యాహ్న భోజనం అంతంత మాత్రమే..

ఇక మధ్యాహ్న భోజనం అయితే ఏకంగా ముప్పై శాతం మందికి పైగా విద్యార్థులు తినని పరిస్థితి చోటుచేసుకుంటుంది. కొన్ని చోట్ల అదనపు గదుల నిర్మాణాలు నిలిచిపోవడంతో ఇరుకు గదుల్లో రెండు, మూడు తరగతులను నిర్వహిస్తున్న పరిస్థితి కనిపిస్తుంది. ఇక సింగిల్ టీచర్ పాఠశాలల్లో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గత ప్రభుత్వం విద్యా సంవత్సరం ఆరంభం నాటికే అమ్మ ఒడిని అందించగా, ప్రస్తుత ప్రభుత్వం తల్లికి వందనం ఈ సంవత్సరం ఇప్పటి వరకు అందజేయని పరిస్థితి ఉంది.

నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు..

ప్రాథమిక పాఠశాలలు: 167
అప్పర్ ప్రైమరీ పాఠశాలలు: 24
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు: 41
విద్యార్థులు: 16,147

ఉపాధ్యాయుల వివరాలు..

కావలసిన ఉపాధ్యాయుల సంఖ్య: 1,191
ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య: 8,894

విద్యార్థుల ఎన్‌రోల్ వివరాలు..

2023-24 విద్యా సంవత్సరం: 17,861
2024-25 విద్యా సంవత్సరం: 17,048

మధ్యాహ్న భోజనం వివరాలు..

భోజనం చేసే విద్యార్థుల సంఖ్య: 13,236
మధ్యాహ్న భోజన ఏజెన్సీలు: 222

ఏకోపాధ్యాయులే..!



నడింపాలెం ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న సింగిల్ టీచర్

ప్రత్తిపాడు: నాది సింగిల్ టీచర్ పాఠశాల. ఒక్కటే టీచర్ పోస్టు ఉండటం వలన ఇబ్బందులు పడవలసి వస్తోంది. ఆన్‌లైన్ వర్క్స్, ఆఫ్‌లైన్ వర్క్స్.. ఇలా చాలా కష్టతరమవుతుంది. ఐదు తరగతులకూ నేనొక్కదాన్నే అన్ని సబ్జెక్టులూ బోధించాల్సి వస్తుంది. ఇబ్బందిగా ఉన్నప్పటికీ తప్పడం లేదు. ఇదీ ఓ ప్రాథమిక పాఠశాలలోని సింగిల్ టీచర్ ఆవేదన.

విద్యార్థి ప్రగతికి బాటలు వేసేది విద్య. గురువే ఇందుకు మార్గదర్శి. పాఠశాలల్లో నేర్చుకునే అభ్యాసాలే విద్యార్థుల భవిష్యత్‌కు నాంది. అలాంటి ప్రాథమిక విద్యను బోధించే పాఠశాలల్లో ఏకోపాధ్యాయులే ఐదు తరగతులకు పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. ఫలితంగా అటు ఉపాధ్యాయులకు, ఇటు విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రత్తిపాడు మండలంలో అధికారికంగా ఏడు సింగిల్ టీచర్ పాఠశాలలున్నప్పటికీ, తూర్పుపాలెంలోని ప్రాథమిక పాఠశాలలోని ఇద్దరు టీచర్లలో ఒకరు మెడికల్ లీవ్‌లో ఉండటంతో ఆ పాఠశాలలో ఒక్కరే టీచర్ అన్ని తరగతులకు బోధిస్తున్నారు.

ఐదు తరగతులూ ఒక్కరే..

విద్యాహక్కు చట్టం ప్రకారం ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండకూడదు. కానీ ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో సింగిల్ టీచర్లే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు విద్యార్థులందరినీ ఒకే చోట కూర్చోబెట్టి అన్ని సబ్జెక్టులను ఒక్కరే బోధించాల్సి వస్తుంది. పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు ఉండటం, వారు ఏ కారణం చేతనైనా హాజరు కాలేని పక్షంలో ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ కాలం నెట్టుకొస్తున్నారు.

డిప్యుటేషన్‌పై పంపిస్తున్నాం



సింగిల్ టీచర్ ఉపాధ్యాయులున్న పాఠశాలల్లో వారు సెలవు తీసుకోవలసి వస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఉపాధ్యాయులు అదనంగా ఉన్న పాఠశాలల నుంచి సింగిల్ టీచర్ పాఠశాలకు డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను పంపిస్తున్నాం. డిప్యుటేషన్‌కు అవకాశం లేనప్పుడు సీఆర్పీలను పంపించి సర్దుబాటు చేస్తున్నాం.

– సీహెచ్ రమాదేవి, ఎంఈవో, ప్రత్తిపాడు

రాహు కేతు పూజలకు పోటెత్తిన భక్తులు

అన్ని సేవల ద్వారా ఆదివారం ఒక్కరోజు ఆదాయం రూ.12,75,000



పెదకాకాని శివాలయంలో రాహు కేతు పూజలు చేస్తున్న అర్చకులు

పెదకాకాని: శివాలయంలో రాహు కేతు పూజలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం .. అమావాస్య.. రాహు కేతు పూజలకు విశేషమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాహు కేతు మండపంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పందిళ్లు, క్యూ లైన్లు, తాగునీరు ఏర్పాటు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. వేకువ జామున 5 గంటల నుంచి ఈ పూజలు ప్రారంభమయ్యాయి. గ్రహ దోషాలు తొలగిపోయేందుకు రాహు కేతు పూజలు పెదకాకాని శివాలయంలో ప్రత్యేకంగా నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి 2,140 మంది ఈ పూజల్లో పాల్గొన్నారు. స్వామి వారి రాహు కేతు పూజల ద్వారా రూ.10,70,000 ఆదాయం చేకూరిందని డిప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలియజేశారు. అలానే శివాలయంలో ఆదివారం అంతరాలయ పూజలు, అభిషేకాలు, అన్నప్రాసనలు, నామకరణం, వాహన పూజలు, కేశఖండనలు వంటివి అధిక సంఖ్యలో జరిగాయి. పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చిన భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అన్ని సేవల ద్వారా ఆదివారం ఒక్కరోజులో స్వామి వారికి రూ.12,75,000 ఆదాయం చేకూరినట్లు ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



రాహు కేతు పూజల్లో భక్తులు

మన బడి బాగుపడేనా..!?

- నేటికీ ప్రారంభానికి నోచుకోని ఆర్వోప్లాంట్లు, డిజిటల్ స్క్రీన్లు
- విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందని స్టూడెంట్ కిట్లు



నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్

పొన్నూరు: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధి కోసం నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశారు. రూ.కోట్లను వెచ్చించి పాఠశాలల రూపురేఖలు మార్చారు. విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు ఏర్పాటు చేస్తున్న డిజిటల్ స్క్రీన్లు, స్వచ్ఛమైన నీటిని అందించేందుకు పాఠశాలలకు చేరిన ఆర్వో ప్లాంట్లు వినియోగానికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. దీంతో విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి రెండు నెలలు పూర్తవుతున్నా పాఠశాలల అభివృద్ధి జాడలు కనిపించడం లేదు.

పొన్నూరు మండలంలోని వెల్లలూరు గ్రామంలోని ప్లస్ టూ జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.కోటి ఆరు లక్షలతో చేపట్టిన పనులు అర్ధంతరంగా నిలిచిపోయి, సామగ్రి నిరుపయోగంగా మారింది. చిన్న చిన్న పనులతో నిలిచిన అభివృద్ధి పనులకు అవరోధం ఏర్పడింది. లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు, డిజిటల్ స్క్రీన్లు, వినియోగానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పాఠశాలలను అభివృద్ధి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



తక్కెళ్ళపాడు జిల్లా పరిషత్ పాఠశాల

చేబ్రోలులో...

చేబ్రోలు: ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయంగా మారుతున్నాయా... అంటే అవుననే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించాలంటే ఆందోళన చెందే పరిస్థితులు నెలకొంటున్నాయి. క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గి నామమాత్రంగా కొనసాగుతున్నాయి.

చేబ్రోలు మండలంలో పాఠశాలల వివరాలు

ప్రాథమిక పాఠశాలలు	39
ప్రాథమికోన్నత పాఠశాలలు	2
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు	6
విద్యార్థుల సంఖ్య	7,589

మండలంలో అతి తక్కువగా కొత్తపాలెం ఎంపీపీ స్కూల్‌లో కేవలం నలుగురు విద్యార్థులు, శేకూరుపాలెం ఏఏ ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు, గొడవర్రు ఉర్దూ స్కూల్‌లో 8 మంది, శేకూరు ఎల్ఈ, వేజండ్ల టీకే స్కూల్, సుద్దపల్లి స్కూల్‌లో 11 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు.

పెదకాకానిలో...

పెదకాకాని: మన బడి నాడు నేడు పథకము ద్వారా గత ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది.



నిరుపయోగంగా ఉన్న డిజిటల్ స్క్రీన్

మండలంలో పాఠశాలల వివరాలు

జిల్లా పరిషత్ పాఠశాలలు	7
ప్రాథమికోన్నత పాఠశాలలు	3
ప్రాథమిక పాఠశాలలు	37
మంది విద్యార్థుల సంఖ్య	43,708

మధ్యాహ్న భోజనం నిర్వహణలో పర్యవేక్షణ కరువై నాణ్యత తగ్గుతోంది. దీంతో పలువురు విద్యార్థులు బాక్సులు తెచ్చుకుంటున్నారు. విద్యార్థులకు భోజనంలో ఇస్తున్న కోడిగుడ్డు చిక్కిపోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందని స్టూడెంట్ కిట్లు.

ప్లస్ టూ చదువులకు ఉపయోగం



రూ.కోటి 6 లక్షలతో చేపట్టిన పనులు చివరి దశలో ఆగిపోయాయి. నిర్మాణాలు పూర్తయి చిన్న చిన్న పనుల కారణంగా భవనం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. నిలిచిపోయిన చిన్న చిన్న పనులను త్వరితగతిన పూర్తి చేస్తే ప్లస్ టూ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– కె.రమేష్, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, వెల్లలూరు

అలరించిన ఘంటసాల భక్తి గాన నీరాజనం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం నవకళోదయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఘంటసాల భక్తి గాన నీరాజనం నిర్వహించారు. పీఎల్ఎన్ మూర్తి నిర్వహణలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, నవ కళోదయ సభ్యుల జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ, గాయకులు టి.సుధీర్, ఆర్.పి.ఎల్. నరసింహారావు, అన్నపూర్ణ, నారాయణ, మోహన్, అశోక్, వెంకాయమ్మ పాల్గొన్నారు. తిరు వెంకటాదీశ జగదీశా, ఎంతెంత దయనీది ఓ సాయి, ఏడుకొండల స్వామి ఎక్కడున్నావయ్యా, పిలిచిన పలుకవే ఓ స్వామి వంటి భక్తి గీతాలు హృద్యంగా ఆలపించారు.

● విద్యా శాఖ మొద్దు నిద్ర.. బంగారు బాల్యం ఛిద్రం



మెయిన్ రోడ్డులో పసికందును ఎత్తుకుని యాచన చేస్తున్న బాలిక

బతుకు బాటలో బడి ఈడు బాల్యం బదనాం అవుతుంది. జీవన పోరాటం చేస్తుంది. వారిని బడి మెట్లు ఎక్కించాల్సిన విద్యా శాఖ మొద్దు నిద్రపోతుండటంతో బంగారు బాల్యం బుగ్గిపాలవుతుంది. ప్రత్తిపాడులోని ఎస్టీ కాలనీ చిన్నారులు బడికి రాకుండా యాచన బాట పడుతున్నారు. కాలనీలోని చిన్నారులంతా స్థానికంగా ఉన్న ఏదో ఒక పాఠశాలలో నమోదై ఉంటారు. వీరి సంఖ్యతో ఉపాధ్యాయుల పోస్టులను పెంచుకుంటారు. కానీ వారు పాఠశాలలకు వచ్చేది తక్కువే. ఇటీవల ప్రత్తిపాడు వచ్చిన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి దృష్టికి ఈ విషయం రావడంతో స్పందించిన ఆమె మండల ప్రత్యేకాధికారిగా ఉన్న సమగ్ర శిక్ష ఏపీసీ, ఉప విద్యాధికారి, మండల విద్యాశాఖాధికారులు, రెవెన్యూ, ఎంపీడీవో, సచివాలయ ఉద్యోగులు అందరూ కలిసి ఫీల్డ్‌కి వెళ్లి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, ఆ చిన్నారులంతా బడికి క్రమం తప్పకుండా వచ్చేలా చూడాలని ఆదేశించారు. కానీ ఒక్కరంటే ఒక్కరు కూడా కలెక్టర్ ఆదేశాలపై స్పందించలేదు. ఆ.. కలెక్టరా.. చెబితే ఏముందిలే అనుకున్నారో ఏమో తెలియదు గానీ ఆ కాలనీలోనికి అడుగు కూడా నేటి వరకు పెట్టలేదు. ఫలితంగా చిన్నారులు రోడ్లపై యాచన బాట పడుతున్నారు. ఆ చిత్రాలే ఇవి. - ప్రత్తిపాడు



మండల విద్యావనరుల కార్యాలయం ఎదుట మేకలు కాసుకుంటున్న బాలుడు



ప్రత్తిపాడులో యాచన బాటలో మరో బాలిక

గ్రామాల్లో కోతులు, కుక్కల బెడదతో ఇబ్బందులు

చేబ్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో కె జ్యోతి

చేబ్రోలు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో కోతులు, కుక్కల బెడద ఎక్కువైందని వీటి నివారణపై గ్రామ పంచాయతీలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చేబ్రోలు ఎంపీడీవో కె.జ్యోతి ఆదేశించారు. చేబ్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మండలాధికారులు చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖాధికారి బి.శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ సాగులో అవసరానికి మించి రసాయన, క్రిమి సంహారక మందులు పిచికారీ చేయటం వల్ల లాభం కన్నా నష్టం చేకూరుతుందన్నారు. రైతులకు యంత్ర పరికరాల అందజేతపై ప్రభుత్వం త్వరలో మార్గదర్శకాలను అందజేస్తుందన్నారు. చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి అబ్రహం లింకన్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో ప్రతి రోజు 90 నుంచి 100 మంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మూడు షిఫ్టుల్లో 24 గంటలు వైద్య సిబ్బంది పనిచేస్తున్నామన్నారు. ఆరోగ్య ఆసరా కింద డెలివరీ అయిన మహిళలకు రూ.5 వేలు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీలో మూడు డెలివరీలు జరిగాయన్నారు. వడ్లమూడి, కొత్తరెడ్డిపాలెం గ్రామాల పరిధిలో అధికంగా మంకీ బైట్ కేసులు వస్తున్నాయన్నారు. కుక్క కాటు కేసులు వస్తున్నాయన్నారు. నారాకోడూరులో ఇటీవల ఒక డెంగీ కేసు నమోదైందన్నారు. వైద్యశాలలో 164 రకాల మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఎంఈవో ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతంగా ఉన్నాయన్నారు. ఉద్యాన శాఖాధికారిణి పి.ఉష పండ్ల తోటలు, పందిరి తోటలకు అందిస్తున్న రాయితీలను వివరించారు. శేకూరు గ్రామంలో సుమారు మూడు వేల కోతులు ఉన్నాయన్నారు. వీటి బెడద వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొండముచ్చులను ఏర్పాటు చేయటం ద్వారా కోతుల బెడదను నివారించవచ్చునని ఎంపీడీవో జ్యోతి సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి వైస్ ఎంపీపీ కాసు అనిత, వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పీఎస్ నగర్‌కు చెందిన వెంకటేష్(35) ఆరు నెలల కిందట ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికి కనిపించకుండాపోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్ సిక్స్ హామీల్ని సత్వరమే అమలు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్

లక్ష్మీపురం: సూపర్ సిక్స్ హామీలని ప్రజలకు చెప్పి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం త్వరితగతిన వాటిని అమలు పరచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో శాఖా సమితి సమావేశాలు పెద్ది శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ముందుగా కేరళలోని వయనాడ్‌లో భారీ వర్షాలు, వరదలు వల్ల మరణించిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ వయనాడ్ బాధితులకు బియ్యం, వస్తు రూపంలో సహాయం చేసి మానవత్వాన్ని చాటుకోవాలని కోరారు. సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ నగరంలో పీకల వాగు, రోడ్ల సమస్యపై పోరాటాలకు సిద్ధం కావాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. గత 25 సంవత్సరాలుగా నార్ల వెంకటేశ్వరరావు మెమోరియల్ నగర పాలక సంస్థ ఆడిటోరియం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో సగం నిర్మాణం జరిగి ఎందుకు పనికిరాని విధంగా ఉన్నదని గుర్తు చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం ఆడిటోరియాన్ని సత్వరమే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.